క్లుప్తంగా

ఆకట్టుకున్న వేములదీవి వెంకన్న అలంకరణ



నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి కాపుల కొడప వెంకటేశ్వర స్వామిని శనివారం ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి విశేష సేవలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అన్నసమారాధన నిర్వహించారు.

ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ



ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

పెనుగొండ: ఆచంట మండలంలో శనివారం వ్యవసాయ శాఖ, విజిలెన్స్ శాఖలు సంయుక్తంగా ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దివ్యసాయి ఏజెన్సీస్, సాయిరాం ఎంటర్‌ప్రైజెస్ షాపులను తనిఖీ ఎటువంటి వ్యత్యాసం లేదని అధికారులు తెలిపారు. ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ తహసీల్దారు కె.కన్యాకుమారి, విజిలెన్స్ ఎస్సై కె.నాగరాజు, మండల వ్యవసాయాధికారి బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు



సిద్ధాంతంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పెనుగొండ: సత్యసాయి రాష్ట్ర ఆర్గనైజేషన్ విద్యా విభాగం ఆధ్వర్యంలో శనివారం సిద్ధాంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో తణుకు డివిజన్ కన్వీనరు ఆరిమిల్లి సాయిబాబు మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక ఆధ్యాత్మిక, మానవత విలువలను పెంపొందించడానికే వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రేపటి భవిష్యత్ మన చేతుల్లోనే అన్న అంశంపై పోటీ నిర్వహించినట్లు వివరించారు. 80 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో బోళ్ల వెంకటేశ్వరరావు, నక్క విష్ణు తదితరులు పాల్గొన్నారు.

శ్రమ దోపిడీ కోసమే లేబర్ కోడ్‌ల విధానం



మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: కార్మికుల శ్రమ దోపిడీ చేసేందుకే కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి వేసిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్నిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఆచంట రామేశ్వర స్వామి సత్రంలో సీఐటీయూ 5వ మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గంపై పెట్టే నిర్బంధాలకు వ్యతిరేకంగా అన్ని వర్గాల కార్మికులు శ్రామికులు పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నేలపాటి విజయలక్ష్మి, గూడవల్లి బేబీ, కేతా నాగాంజనేయులు, వైట్ల ఉష, నాగిశెట్టి గంగరావు, బండి రంగారావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా వెంకట్రావు



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న వెంకట్రావు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని పీఎల్‌కే ఎయిడెడ్ పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయుడు చీకట్ల వెంకట్రావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు అందుకున్నారు. శుక్రవారం గురుపూజోత్సవం సందర్భంగా భీమవరంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, కలెక్టర్ సీహెచ్ నాగరాణిల చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా డిఈవో నారాయణ, పాఠశాల కరస్పాండెంట్ బి.చిట్టిబాబు తదితరులు వెంకట్రావును అభినందించారు.

బైబై గణేశా..!

- ముగిసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు
- గ్రామాల్లో ఉత్సాహంగా నిమజ్జనాలు

పెనుగొండ: గ్రామాల్లో శనివారం గణపతి నిమజ్జనాల సందడి నెలకొంది. ఆదివారం చంద్రగ్రహణం కావడంతో శనివారం చలువ పందిళ్లలోని అన్ని గణపతి ప్రతిమలను నిమజ్జనం చేయడానికి గ్రామోత్సవాలు నిర్వహించడంతో వీధులన్నీ హోరెత్తిపోయాయి. ముఖ్యంగా పెనుగొండలో ఉదయం నుంచి యువత కేరింతలతో నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. కొందరు యువత అత్యుత్సాహంతో చెదురు మదురు సంఘటనలు, గలటాలు జరిగాయి. పెద్దలు సర్దిచెప్పడంతో ఉత్సవాలు ముందుకు సాగాయి. పెనుగొండ వర్తకం సంఘం ఆధ్వర్యంలోనూ, శెట్టిబలిజ నాలుగు సంఘాలు ఆధ్వర్యంలోనూ, జవ్వాదివారి వీధి, కంబాల వారివీధి, పల్లపు వీధిల్లోనూ, చెరుకువాడ, లింగాల వీధిల్లోనూ పూజలందుకొన్న గణనాథులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉత్సవంలా నరసాపురం కాలువ వైపు నిమజ్జనానికి కదలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయా చలువ పందిళ్లలో నిర్వహించిన లడ్డూ వేలంలు ఉత్సాహంగా జరిగాయి. సిద్ధాంతంలో కాలువ గట్టు కుర్రోళ్ల ఆధ్వర్యంలో జేసీబీపై వినాయక ప్రతిమను ఉంచి వినూత్నంగా ఉత్సవం నిర్వహించారు. 20 ఆటోలపై దేవతామూర్తుల వేషధారణలతో గ్రామోత్సవం నిర్వహించారు.

నరసాపురంలో..

నరసాపురం: గణపతి ఉత్సవాలు ముగియడంతో నిమజ్జనాల కార్యక్రమం శనివారం ఉత్సాహంగా సాగింది. పట్టణంలో పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన విగ్రహాలను డీజే మ్యూజిక్‌లు, బుట్టబొమ్మల కోలాహలం, డ్యాన్స్‌లతో భారీ ఊరేగింపు చేసి, నిమజ్జనం చేశారు.

యలమంచిలిలో..

యలమంచిలి: గణపతి నవరాత్రులు పూర్తి కావడంతో మండలంలో శనివారం నిమజ్జన కార్యక్రమాలు సందడిగా జరిగాయి. తీన్‌మార్ డప్పులు, డీజే సాంగ్స్, కళాకారుల నృత్యాలతో గణనాథుడిని గ్రామంలో ఊరేగించి అనంతరం దొడ్డిపట్ల, లక్ష్మీపాలెం, చించినాడ, బాడవ గ్రామాల వద్ద గోదావరిలో నిమజ్జనం చేస్తున్నారు. మేడపాడు శివాలయం వీధిలో ఏర్పాటుచేసిన వినాయకుడి నిమజ్జనోత్సవం జాతరను తలపించింది.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: గణపతి నవరాత్రి ఉత్సవాలు చివరి రోజుకు చేరుకోవడంతో శనివారం మండలంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి ప్రతిమలను ఊరేగించారు. కొప్పర్రు పెద్దవీధిలో ఏర్పాటు చేసిన భారీ గణపతి విగ్రహాన్ని వీధుల గుండా ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. వేములదీవి, పసలదీవి, వైఎస్‌పాలెం, కొప్పర్రు, లక్ష్మణేశ్వరం తదితర గ్రామాల్లో కూడా నిమజ్జన వేడుకలు నిర్వహించారు.



పెనుగొండ: వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆకట్టుకున్న గ్రామోత్సవం



యలమంచిలి: మేడపాడులో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు



పాలకొల్లు సెంట్రల్: భగ్గేశ్వరంలో శ్రీమన్నారాయణుడి అలంకరణ మండపంలో గణనాథుడి ఊరేగింపు

పాలకొల్లులో..

పాలకొల్లుసెంట్రల్: గణపతి నవరాత్రులు సందర్భంగా తొమ్మిది రోజులు పూజలందుకున్న గణనాథుడిని శనివారం నిమజ్జనం చేశారు. ఉదయం నుండి పట్టణంలో అనేక కూడళ్లలో పూజలందుకున్న గణనాథులను వివిద రకాల వాయిద్యాలతో పట్టణ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. మహిళలు, యువతులు సైతం ఆనందోత్సాహాలతో స్వామి వారి ఊరేగింపులో పాల్గొన్నారు.



పెనుగొండ: సిద్ధాంతంలో జేసీబీపై వినూత్న గ్రామోత్సవం



పాలకొల్లు సెంట్రల్: మెయిన్ రోడ్డులో గణనాథుడి ఊరేగింపు



నరసాపురం: వసువులమ్మ గుడి వీధిలో గణపతి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



పెనుగొండ: సిద్ధాంతంలో ఆకట్టుకున్న దేవతామూర్తుల వేషధారణలు

స్వర్ణాంధ్రలో గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్‌లను అందిస్తున్న అడిషనల్ ఎస్పీ వి.భీమారావు

నరసాపురం రూరల్: ఓటమిని గుణపాఠంగా తీసుకుని ప్రయత్నిస్తే విజయం తథ్యమని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం సీతారాంపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే-2025 వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వాసుపల్లి భీమారావు మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో బాధ్యత కలిగిన పౌరులుగా వ్యవహరించాలన్నారు. డీఎస్పీ డాక్టర్ శ్రీ వేద మాట్లాడుతూ సమాజంలోని అరాచక శక్తులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం గ్రాడ్యుయేషన్ పూర్తయిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. యోగా గురువు ప్రసాదరాజు, చైర్మన్ కొండేటి సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి త్రినాథ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సురేష్ పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

నరసాపురం రూరల్: పార్టీలో అంకితభావంతో పని చేస్తే తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం మండలంలోని ఎల్బీచర్ల వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ నియామక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి అందరూ ఐకమత్యంగా పనిచేయాలన్నారు. అనంతరం నూతన ఎల్బీచర్ల నూతన గ్రామ కమిటీనీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జౌదుల సుధాకర్, ప్రధాన కార్యదర్శులుగా కొల్లాటి నాగరాజు, గుబ్బల రాంబాబు, కొలిశెట్టి ప్రసాద్, రాట్నాల నరేష్, కార్యదర్శులుగా కోడెళ్ల ధర్మరాజు, ఒడుగు వీరాంజనేయులు, పెదపట్నపు సూర్యప్రకాష్, తిరుమలశెట్టి బాల సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులుగా అందే నర్సింహరావు, తంగెళ్ల ఉమాపతి, మురాల శ్యాంబాబు, కడలి శ్రీను, బైనపాలెం ఈశ్వరరావు, కొల్లాటి బాబూరావు, గుబ్బల శ్రీరాములు, చిట్టిగుళ్ల బాబ్జి, పెదపట్నపు శ్రీనివాసరావులు ఎన్నికయ్యారు. అలాగే యూత్ గ్రామ అధ్యక్షుడిగా పెచ్చెట్టి వినయ్, ప్రధాన కార్యదర్శిగా జెల్లి సురేష్, కొయ్యే రాజారోహిత్, పెదపట్నపు నారాయణరావు, శీలబోయిన శ్రీనివాసరావులు ఎన్నికయ్యారు. రైతు విభాగం అధ్యక్షుడిగా తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా గుంపుల సునీల్, బీసీ సెల్ అధ్యక్షుడిగా కడలి రామకృష్ణ, మహిళా విభాగం అధ్యక్షురాలిగా సంగాని నాగవెంకట దుర్గా భవాని, మేధావుల ఫోరమ్ అధ్యక్షుడిగా అయ్యగారి కృష్ణమోహన్, సోషల్‌మీడియా అధ్యక్షుడిగా కొల్లాటి వరప్రసాద్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉంగరాల రమేష్ నాయుడు, పీడీరాజు, పెండ్ర వీరన్న, ఎంపీపీ మైలా బత్తుల సోనీ, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, దొంగ మురళీకృష్ణ, గుబ్బల కైలాష్, మురాల చిన్న, బొడ్డు ఆషిష్‌కుమార్, దొండపాటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్బీచర్ల గ్రామ కమిటీని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు

గోదావరి గట్టున చెత్త డంపింగ్ నిలుపుదల

నరసాపురం: గోదావరిగట్టున చెత్తను డంప్ చేయడం పూర్తిగా నిలుపుదల చేసినట్టు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేశారు. డంపింగ్‌యార్డ్ కోసం వేములదీవి, సరిపల్లి గ్రామాల్లో మున్సిపాలిటీ కొనుగోలు చేసిన రెండు స్థలాల్లో కూడా చెత్తను వేయడానికి ఆయా గ్రామస్తులు అంగీకరించడం లేదని పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని వివరించారు.

దాడులు చేసిన వారిని అరెస్ట్ చేయాలి



జాన్ కెనడీ

నరసాపురం రూరల్: రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను వైఎస్సార్ సీపీ దళిత నాయకులు ఇంజేటి జాన్ కేనడి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఏలూరు జిల్లా కైకలూరు మండలం దానగూడెం దళితులపై దాడి చేసిన జనసేన నేతలను వెంటనే అరెస్టు చేయాలని, ఉండి మండలం చెరుకువాడ చిన్నపేటకు చెందిన ఇద్దరు దళిత యువకుల పై దాడి చేసి కులం పేరుతో దూషించిన వ్యక్తుల పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దాడుల చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే దళిత సంఘాలు అన్ని ఏకమై ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

యలమంచిలి: మండలంలోని కట్టుపాలెం గ్రామానికి చెందిన గుడాల రాఘవులు(70) పురుగుమందు తాగి, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపారు. గుడాల రాఘవులు భార్య ఏడాది క్రితం చనిపోయింది. అప్పటి నుంచి రాఘవులు తన చిన్న కుమారుడు రమేష్ ఇంటి వద్ద ఉంటున్నాడు. భార్య వియోగంతో మనోవేదనకు గురైన రాఘవులు ఈ నెల 4న పురుగుమందు తాగాడు. వెంటనే అతనిని కుటుంబ సభ్యులు వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాఘవులు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టిన గుర్తు తెలియని వాహనం

పెనుమంట్ర: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో కామారెడ్డి రైస్ మిల్ వద్ద స్టేట్ హైవే రోడ్డు పక్కన ఉన్న 63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ట్రాన్స్‌ఫార్మర్ పక్కన ఉన్న స్తంభం విరిగి వైర్లు గాలిలో వేలాడుతుతున్నప్పటికీ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకపోవడంతో స్థానికులు ఎవరూ ప్రమాద సంఘటన గుర్తించలేదు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ అధికారులు ఉదయం విరిగిన స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని నిర్మించి, ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి కుమారుడిపై దాడి



గాయపడిన జగీదీష్

పాలకొల్లు సెంట్రల్: గణేష్ నిమజ్జనంలో పాత కక్షల కారణంగా టీడీపీకి చెందిన యువకులు వైఎస్సార్ సీపీ నాయకుడి తనయుడిపై దాడి చేశారు. బాధితుడి తండ్రి వైఎస్సార్ సీపీ పట్టణ సెక్రటరీ పొట్టిపాటి హరిగోపాల్ తెలిపిన వివరాలు ప్రకారం శనివారం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ 24వ వార్డులో లక్ష్మీగణపతి ఆలయం ఊరేగింపు చేస్తున్నారు. ఈ ఆలయానికి వెనుక వీధిలో హరిగోపాల్ కుటుంబం నివాసం ఉంటుంది. ఈ ఊరేగింపు ఆ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మండెల ప్రసాద్‌పై కొందరు యువకులు దాడి చేయబోయారు. అక్కడే ఉన్న జగదీష్ వెళ్లి అతనిపై దాడి చేయకుండా అడ్డుకున్నాడు. ఇంతలో ఆ యువకులు ఊరేగింపు కూడా వెళ్లిపోయారు. మా అబ్బాయి జగదీష్ మండెల ప్రసాద్‌కు మంచినీళ్లు ఇవ్వడానికి బాటిల్‌తో నీళ్లు తీసుకుని వెళ్తున్న క్రమంలో అక్కడే చెట్టు కింద ఉన్న ఎ.నవీన్ అనే యువకుడితో పాటు పదిమంది దాడి చేశారు. జగదీష్ వైజాగ్‌లో ఉద్యోగం చేసుకుంటున్నాడు. తన తల్లికి ఒంట్లో బాగాలేదని గురువారం చూడడానికి వచ్చాడన్నారు. అలాగే నాలుగేళ్ల క్రితం కారుపై గీతలు గీశారని గతంలో నవీన్ అనే యువకుడిని జగదీశ్ నిలదీశాడని, అది మనసులో పెట్టుకుని ఈ రోజు కాపుకాచి తన కుమారిడిపై దాడి చేశారని హరిగోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దాడిలో గాయపడిన జగదీష్ ప్రస్తుతం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

పంచాయతీ పురోగతిపై శిక్షణ

యలమంచిలి: పంచాయతీ పురోగతికి తీసుకోవలసిన చర్యలపై శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మీ రవికుమార్ అధ్యక్షతన ఈఓపీఆర్డీ జేడీవి ప్రసాద్ పర్యవేక్షణలో ఆర్యపేట పంచాయతీ కార్యదర్శి అందే కోటి నాగయ్య సభ్యులకు తొమ్మిది అంశాలపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీ ఆదాయం పెంచుకునే మార్గాలు, పారిశుద్ధ్య, పేదరిక నిర్మూలన, జీవనోపాధికి గ్రామాలలో కల అవకాశాలు తదితర అంశాలను ఆయన వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మీ రవికుమార్

నిధులు లేని శిక్షణ ఎందుకు?

సమావేశంలో పాల్గొన్న సభ్యులు పంచాయతీలకు నిధులు మంజూరు చేయకుండా ఇలాంటి శిక్షణలు ఇచ్చి ఏం ప్రయోజనం? అని ప్రశ్నించారు. మరొక ఆరు నెలల కాలంలో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిపోనుండగా ఇప్పుడు శిక్షణ ఇచ్చి ప్రయోజనం ఏంటి? అన్నారు. అనంతరం వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మండల పరిషత్‌లో ఈ ఏడాది జనవరికి రూ.78 లక్షలు నిధులు ఉన్నాయన్నారు. మండల సమావేశంలో తీర్మానం చేసినా కూడా అధికారులు ఎస్టిమేట్స్ వేయకపోవడం వల్ల నిధులన్నీ నిర్వీర్యం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కవురు గోపి, పాలంకి శ్రీనివాసరావు, కొండేటి జీవరత్నం, తాళ్ల నాగరాజు, అనిశెట్టి మల్లిక, తుంగా అమూల్య, మేడిది విజయ జ్ఞానమణి, దంగేటి రాజమణి ఎంపీటీసీ సభ్యులు మానుకొండ చిట్టెమ్మ, కంబాల సత్యశ్రీ, జిల్లెళ్ల రత్నంరాజు, కవురు నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యాన్ని పేదలకు దూరం చేయవద్దు



ఉచ్చుల స్టాలిన్‌బాబు

యలమంచిలి: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం పేరిట ప్రైవేట్‌పరం చేయడానికి రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం పేదల వైద్యానికి శరాఘాతమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని, రాష్ట్రంలో అన్ని వర్గాల విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. 17 కళాశాలలకు ప్రభుత్వ నిధులతో సుమారు 60 నుంచి 70 ఎకరాలు సమకూర్చి, ఒక్కో కళాశాల నిర్మాణానికి రూ.475 కోట్లు కేటాయించారని వివరించారు. అటువంటి బృహత్తర కార్యక్రమాన్ని ఏ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన కొనసాగించాలే కానీ, ఈ కళాశాలల నిర్మాణం పూర్తయితే జగన్‌మోహన్‌రెడ్డికి పేరు వస్తుందనే కారణంతో వాటిని ప్రైవేట్‌పరం చేయడం సమంజసం కాదని మండిపడ్డారు. ఇటు పేదల మెరుగైన ఉచిత వైద్యానికి అటు ప్రతిభ కలిగిన పేద విద్యార్థుల భవిష్యత్‌కు శరాఘాతమైన మంత్రి వర్గ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని స్టాలిన్‌బాబు డిమాండ్ చేశారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పదో అదనపు జిల్లా జడ్జి వాసంతి

నరసాపురం: జాతీయ లోక్ అదాలత్‌ను ఈ నెలన 13న నిర్వహించనున్నామని, ఈ నేపథ్యంలో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి సూచించారు. శనివారం నరసాపురం కోర్టు హాలులో ఆమె లోక్ అదాలత్ నిర్వహణపై పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీ మార్గమే రాచమర్గమన్నారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని చెప్పారు. కక్షిదారుల్లో అవగాహన కల్పించి కేసులు పరిష్కరించుకోవడానికి కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పిచికారీపై రైతులకు అవగాహన



గుంపర్రులో డ్రోన్ పనితీరు వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

యలమంచిలి: మండలంలోని గుంపర్రు, కాంభొట్లపాలెం గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తున్న రైతులకు శనివారం ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి ఎ.జ్యోతి వ్యవసాయంలో డ్రోన్ పనితీరు వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో ఎక్కువగా వినియోగించే బయోకల్చర్, కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణాలను డ్రోన్‌తో పిచికారీ చేయిస్తే కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. ఈ రెండు కలిపి పిచికానీ చేయడం వలన పైరు పెరుగుదలకు, అన్ని రకాల క్రిమికీటకాలు నివారణకు ఉపయోగపడుతుందన్నారు. అనంతరం డ్రోన్ పిచికారీ విధానాన్ని రైతులకు చూపగా ఆసక్తిగా తిలకించారు. డ్రోన్‌తో పిచికారీ చేయడం వల్ల మందు, సమయం, డబ్బు ఆదా అవుతుందని జ్యోతి చెప్పారు. కార్యక్రమంలో రైతులు చిట్టూరి సీతారామాంజనేయులు, జద్దు రామకృష్ణ, సీహెచ్ వెంకటేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జద్దు లక్ష్మీనారాయణ, బండి లక్ష్మీ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

చిన్న తరహా పరిశ్రమలపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న శరత్

పాలకొల్లు సెంట్రల్: వ్యాపారంలో ప్రధానంగా మేనుఫ్యాక్చరింగ్, సర్వీసు సెక్టార్, ట్రేడింగ్ అనే మూడు ప్రధాన అంశాలు ఉంటాయని ప్రతి వ్యాపారానికీ డబ్బే అవసరం లేదని సరైన ప్రణాళిక ముఖ్యమని జాతీయ సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రైస్ డెవలప్మెంట్ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ ముత్యాల శరత్ అన్నారు. శనివారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆవిష్కార్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ వ్యాపారం అనేది జీవన సరళి అన్నారు. మన ప్రణాళికలను నిపుణులైన వారికి తెలియజేసి, వారి సలహాలను స్వీకరించాలన్నారు. మేనుఫ్యాక్చరింగ్ అనేది ఖర్చుతోను అనుభవంతోనూ కూడుకున్నదని సూచించారు. ముఖ్యంగా వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, అధ్యాపకులు నోబుల్ రాజు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ రమణ, జాన్‌రాజ్, రేవతి, మహాలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.